క్లుప్తంగా

దాడిపై సమగ్ర విచారణ జరిపించాలి

ఎదులాపురం: పార్లమెంట్‌పై స్మోక్ దాడి ఘటనపై విచారణ జరిపించి, దుండగులను కఠినంగా శిక్షించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్మోక్‌దాడి, ఎంపీల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్, న్యూడెమోక్రసీ నాయకులు బి.వెంకట్ నారాయణ, లంక రాఘవులు, బండి దత్తాత్రి, పూసం సచిన్ పాల్గొన్నారు .

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: క్రైస్తవులు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఏటా నిర్వహించే క్రిస్మస్ వేడుకలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించడం అభినందనీయమన్నారు. కులాలకు మతాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ అభివృద్ధి జిల్లా అధికారి రాథోడ్ రమేశ్, ఎంపీపీలు నిమ్మల ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, రాథోడ్ సజన్, జెడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, కుంర సుధాకర్, నాయకులు గాడ్గే సుభాష్, పాండరంగ్, నిమ్మల శివకుమార్‌రెడ్డి, పాస్టర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో క్రిస్మస్ వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రం- 7లో శుక్రవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు వేషధారణ ఆకట్టుకుంది. క్రిస్మస్ ట్రీలను తయారు చేసి సంబురాలు జరుపుకున్నారు. పండుగ ప్రాధాన్యతను అంగన్‌వాడీ కార్యకర్త కవిత చిన్నారులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. కార్యక్రమంలో నీమ, డోలి, నగ్మ, స్వాతి, అమీన, ఇర్ఫాన బేగం పాల్గొన్నారు.

భీంపూర్ కొలాంగూడ సమస్యలపై ఆరా



వివరాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: మండలంలోని భీంపూర్ పరిధిలోని భీంపూర్ కొలాంగూడ గిరిజనులు గత 50 ఏళ్లుగా పడుతున్నా కష్టాలను ఈనెల 20న సాక్షిలో 'మారని బతుకులు' అనే కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి ఐసీడీఎస్ అధికారులు, కొలాం గిరిజన సంఘం నాయకులు స్పందించారు. శుక్రవారం వేర్వేరుగా గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. సీడీపీవో శారద ఆదేశాల మేరకు కొత్తపల్లి -హెచ్ అంగన్వాడీ టీచర్ ధనలక్ష్మి, భీంపూర్ అంగన్‌వాడీ టీచర్ అనుసూయ గ్రామాన్ని సందర్శించారు. చిన్నారులు వివరాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటు హక్కు ఉందా? లేదా? అనే వివరాలను సేకరించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీటీజీల అభివృద్ధికి ప్రభుత్వాలు కోట్లాది రూపాయాలు ఖర్చు పెడుతున్నా.. అభివృద్ధికి ఎందుకు కేటాయించడం లేదని సంఘం నాయకులు ప్రశ్నించారు. గ్రామ సమస్యలను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో కొలాం గిరిజన సంఘం అధ్యక్షుడు దేవురావు, దిలిప్ జాదవ్ పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ను అరెస్టు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రానికి చెందిన దళిత యువకుడు ఎంబడి వంశీపై హత్యయత్నం చేసిన కౌన్సిలర్ ఉష్కం రఘుపతిని వెంటనే అరెస్టు చేయాలని దళిత ఐక్య వేదిక నాయకుడు అల్లూరి భూమన్న డిమాండ్ చేశారు. ఆయనతో పాటు అందులో ప్రమేయం ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. భూమన్న మాట్లాడుతూ.. వంశీ అనే యువకుడిపై ఈనెల 18న హత్య చేసే ప్రయత్నం చేసినా.. ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రత్నజాడే ప్రజ్ఞాకుమార్, గడుగు గంగన్న, సందీప్, ప్రశాంత్, శశికాంత్, శోభబాయి తుల్జాపురే, సిద్ధార్థ్, బొల్లారం బాబాన్న, అడేళ్ల, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చేసిన గణిత ప్రదర్శనలు

ఆదిలాబాద్‌టౌన్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం గణిత దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గణితంకు సంబంధించిన అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పట్టణంలోని నం.1 ఉన్నత పాఠశాలలో, పట్టణంలోని ధర్మ విద్యాలయంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుకుమార్, ప్రశాంత్, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, ప్రిన్సిపాల్ స్వప్నలత పాల్గొన్నారు.

గణితమంటే గాబర వద్దు..

గణితమంటే గాబర పడొద్దని జిల్లా విద్యశాఖాధికారి ప్రణీత అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని యూఆర్ఎస్ పాఠశాలలో విద్యార్థులు గణిత ఆకారాలతో ఆకట్టుకున్నారు. సూత్రాలతో చేస్తే గణితం కంటే సులువు మరే సబ్జెక్టు లేదన్నారు. యూఆర్ఎస్ ప్రత్యేక అధికారి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని టీఎస్‌డబ్ల్యూఆర్, నాగభూషణం, వేదం, శిశుమందిర్, సొనాలలోని వివేకానంద పాఠశాల, మర్లపెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జైనథ్: మండల కేంద్రంలోని పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ముగ్గుల పోటీలు, గణిత సూత్రాలతో తోరణాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మోడల్స్, పజిల్స్ ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు శశికళ, సర్పంచ్ నోముల సంతోష్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే గణిత గుర్తులు, గణిత ముగ్గులు వేయించి గణితంపై ఆసక్తి పెంపొందించారు. అలాగే శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రకు సంబంధించిన సినిమాను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు శ్యాంరావ్, ఉపాధ్యాయులు ఆరె భాస్కర్, విద్యాసాగర్ రావు, మధుకర్ వర్మ, రాంకుమార్ పాల్గొన్నారు.

గణితంలో ప్రావీణ్యత సంపాదించాలి

ఇచ్చోడ: గణితంలో మంచి ప్రావీణ్యత సంపాదించాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రాథోడ్ నరేశ్ అన్నారు. గణిత దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని గోల్డన్ లీఫ్ స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. కార్యక్రమంలో గోల్డెన్ లీఫ్ స్కూల్ కరస్పాండెంట్ రాథోడ్ మానిక పాల్గొన్నారు. సన్‌షైన్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కరస్పాండెంట్ గణేష్ పాల్గొన్నారు. ఎస్ఆర్ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సురకంటి వనమాల, విద్యార్థులు పాల్గొన్నారు.



జైనథ్: పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, వెంకట రమణ, ప్రసాద్, సాగర్, నవీన్, భూమేష్ పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్: బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్



తాంసి: కేజీబీవీలో..



ఇచ్చోడ: పరిశీలిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ నరేశ్

తాంసి: మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొన్నారి పాఠశాలల్లో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి సౌజన్య, కప్పర్ల పాఠశాల హెచ్‌ఎం కిష్టన్న, పాఠశాల ఉపాధ్యాయులు సంగీత, శ్రీవిద్య, ప్రమీల, సుజాత, విలాస్, సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

కైలాస్‌నగర్: పార్లమెంట్‌లో విపక్ష పార్టీల ఎంపీల సస్పెన్షన్లను నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో ఆందోళన చేపట్టారు. సేవ్ ఇండియా అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రం నియంతలా వ్యవహరిస్తోందని ప్రశ్నించిన ప్రతిపక్షాల గొంతునొక్కేలా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, సంతోష్, ముడుపు దామోదర్ రెడ్డి, గుడిపెల్లి నగేష్, ఎంఏ షకీల్ పాల్గొన్నారు.

తాంసి: లోక్‌సభలో నుంచి కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష పార్టీల గంతునొక్కే చర్యలను మానుకోవాలని చేశారు. కార్యక్రమంలో నాయకులు సుగుణాకర్ రెడ్డి, అమర్ రెడ్డి, నరేశ్ యాదవ్, గంగారెడ్డి, అన్ను పటేల్, తన్వీర్, రాజన్న పాల్గొన్నారు.

'సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలి'

ఎదులాపురం: బీజేపీ ప్రభుత్వం వామపక్ష, ప్రతిపక్ష ఎంపీలపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. 140కి పై ఎంపీలపై చర్యలు తీసుకోవడం అప్రజాస్వామికమన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను, పాలన వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళిని రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ పాషా, పెద్ది నరసింహులు, గణేశ్, అరుణ్ కుమార్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి కాలినడకన సుద్దగూడ గ్రామానికి వెళ్లి బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అక్కడి నుంచి కల్లురుగూడకు చేరుకొని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తల్లిదండ్రులకు కొత్తబట్టలు పెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆయన వెంట ఎంపీపీ జైవంత్‌రావు, సర్పంచ్ జనార్దన్, మండల అధ్యక్షుడు ఖయ్యూం, చంద్రయ్య, నిసార్, లాజర్, కలీం, ఇర్ఫాన్, సలీం పాల్గొన్నారు.

గణిత దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహించిన గణిత దినోత్సవంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే భొజ్జు పటేల్ పాల్గొన్నారు. రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షబ్బీర్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నేరడిగొండ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బుద్దికొండ గ్రామంలో శుక్రవారం శ్రీ శబరి మాత ఆలయ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నిత్యం ఆలయాల్లో పూజ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెంట వెంకట రమణ, నాయకులు అంబేకర్ పండరి, ఏలేటి రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. నేనున్నా

గుడిహత్నూర్: మండలంలోని డొంగర్‌గావ్‌కు చెందిన దోమకొండ సుధాకర్ ఇల్లు గురువారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సుధాకర్ భార్య ఆశావర్కర్ సునీతను ఓదార్చారు. అధైర్య పడొద్దని అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చిరు. రూ. 50 వేలు నగదు సునీతకు అందజేశారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నార్నూర్: ఏజెన్సీలో దళితుల సమస్యలను పరిష్కరించాలని దళిత సంఘాల నాయకులు దుర్గే మహేందర్, దళిత రత్నా అవార్డు గ్రహిత నర్సింగ్ మోరేలు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో సమానంగా 70 ఏళ్లుగా దళితులు నివాసం ఉంటున్నారని, వారు సాగు చేసే భూములకు హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. భూములు ఉన్నా.. బ్యాంకు ద్వారా పంట రుణాలు పొందలేని పరిస్థితి ఉందని వాపోయా రు. దళితుల సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: పట్టణ కేంద్రాల్లో, గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ జైవంత్‌రావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్డు, వసతి సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల వారీగా అధికారుల నివేదికలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా డబుల్ బెడ్ రూం, ఇళ్ల స్థలాలు, పట్టాలపై దృష్టి సారించాలన్నారు. ఎన్టీఆర్ గ్రౌండ్ సమీపంలోని డంపింగ్ యాడ్ ద్వారా అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్‌రావు, జెడ్పీటీసీ చారులత రాథోడ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కోఆప్షన్ రషీద్, ఎంపీడీవో తిరుమల, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'



రైతులతో మాట్లాడుతూన్న ట్రెయినీ కలెక్టర్

తలమడుగు: రైతుల దళారులను నమ్మి మోసపోవద్దని ట్రెయినీ కలెక్టర్ వికాస్ మోతే అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల, రుయ్యాడీ, తలమడుగు, గ్రామాల్లో పర్యటించారు. రైతులు పండించిన ప్రతీ పంటను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. పంటలు విక్రయించుకునే రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టా పాస్‌బుక్‌ను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. తహసీల్దార్ రాజమోహన్, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కల్యాణలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య. మండల ఏవో మహేందర్. మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు మోసపోకండా చర్యలు తీసుకోవాలని ట్రెయినీ కలెక్టర్ వికాస్ మోతే అన్నారు. మండలంలోని ఐఎఫ్‌పీసీఎస్, విజయలక్ష్మీ, మిథల్ జిన్నింగ్ మిల్లులను సందర్శించారు. రైతులతో మాట్లాడి పత్తి కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేశ్, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు పాల్గొన్నారు.

26 వరకు పత్తి కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని బోథ్, పొచ్చర, నేరడిగొండ, సొనాలలో సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్లు క్రిస్మిస్, బాక్సింగ్ డేను సందర్భంగా ఈనెల 24 నుంచి 26 వరకు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

పీవీరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మాల సంక్షేమ సంఘ భవనంలో శుక్రవారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావు 15వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు శాంతపురం రాజేశ్వర్ మాట్లాడుతూ.. మాలాలకు ఉద్యమ స్ఫూర్తి నింపి అందరిని ఏక తాటి పైకి తీసుకువచ్చిన మహానీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మాల యూత్ ప్రెసిడెంట్ బొజ్జ రాజేందర్, వైస్ ప్రెసిడెంట్ బత్తుల విజయ్, నాయకులు తొగరి శేఖర్, మొగిలి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఫకీర్‌గుట్ట కాలనీలో పీవీరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యమాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బొంకంటి సుభాశ్, పేరుమడ్ల స్వామి, దాస్, ఆనంద్ బాబు, లింగవ్వ, భూమక్క, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కనక మోతుబాయి

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశానికి నాగల్‌కొండ సర్పంచ్ జాదవ్ సునీతనారాయణ్ ఒక్కరే హాజరు కాగా.. మిగిత 22 మంది సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలతో కలిపి మొత్తం ఐదుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో రెండు గంటల్లోనే సమావేశాన్ని ముగించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమయ పాలన పాటించి మూడు నెలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాన్ని ప్రజల పక్షాణ మాట్లాడేందుకు వినియోగించుకోవాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పలు సమస్యలపై తూతూమంత్రంగా చర్చించి, సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్, ఏవో రమేశ్, ఎంఈవో ఆశన్న, సీడీపీవో శారద, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్ రెడ్డి

జైనథ్: రెడ్డి ఐక్యవేదిక యూత్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని మేడిగూడ గ్రామానికి చెందిన క్యాతం శివప్రసాద్ రెడ్డిని నియమించారు. సిద్దిపేటలో జరిగిన రెడ్డి ఐక్యవేదిక కోర్ కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏనుగు సంతోష్ రెడ్డి, తిరుపతి రెడ్డిలు క్యాతం శివప్రసాద్ రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

గుడిహత్నూర్: నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు తుల అరుణ్‌ను రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్‌గా అధిష్టానం నియమించడంతో మండల కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. స్థానిక మార్కెట్‌లో మిఠాయిలు పంచిపెట్టారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అంకతి రవీందర్ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడిన వారిని అధిష్టానం గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చట్ల మహేందర్, ససానే మాధవ్, ఎండీ మజీద్, శ్రీకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాం కలిసిన బీజీఆర్

కైలాస్‌నగర్: తెలంగాణ ఉద్యమ నాయకుడు, టీజేఎస్ పార్టీ వ్యవస్థాపకుడు కోదండరాంను జిల్లా కాంగ్రెస్ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, దుర్గం రాజేశ్వర్‌లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఓటరు నమోదు సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం: ఓటరు నమోదును 18 ఏళ్లు నిండిన యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నూతన ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులు అవకాశం కల్పించిందన్నారు. జనవరి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు లింగన్న, షేక్ నసీం, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

తలమడుగు: గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీవో దిలీప్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల, రుయ్యాడీ, తలమడుగు గ్రామాల్లో పర్యటించారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్: గ్రామీణ బ్యాంకులో పొదుపు ఖాతాలు తీసుకొని, వ్యక్తిగత బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని దేగాం తెలంగాణ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ బొబ్బిలి విజయ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గులాబ్‌తండా గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకులో పొదుపు ఖాతాలు, డిపాజిట్లు, రుణాలు, వ్యక్తిగత ఇన్సూరెన్స్ పథకాలు, సైబర్ నేరాలపై కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విద్యాసాగరా, ధరంసింగ్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ దండె విఠల్ జన్మదిన వేడుకలు

ఉట్నూర్‌రూరల్: మండలంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో కేబీ ప్రాంగణంలోని వికాసం పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చారులత రాథోడ్, వైస్ ఎంపీపీ సలీమొద్దిన్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మెస్రం భీంరావు, శేక్ లతీఫ్, వాసు, బాబా శ్యాం, తిరుపతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ ఎమ్మెల్సీ దండె విఠల్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ సమావేశానికి భీంపూర్ కన్వీనర్ మల్లేశ్

తాంసి: గాంధీభవన్‌లో నేడు నిర్వహిస్తున్న పీసీసీ విస్తృత స్థాయి సమావేశానికి భీంపూర్ మండల కాంగ్రెస్ కన్వీనర్ మల్లేష్ హాజరు కానున్నారు. సమావేశానికి హాజరు కావాలని అధిష్టానం నుంచి పిలుపు వచ్చినట్లు ఆయన తెలిపారు.

'మహాలక్ష్మి పథకాన్ని సవరించాలి'



మాట్లాడుతున్న నాయకులు

నేరడిగొండ: మహాలక్ష్మి పథకాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీకాంత్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కోసం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.లక్ష సంపాదించే మహిళ ఉద్యోగులకు దీన్ని వర్తింపజేయవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగన్న, సుద్దాల లక్ష్మణ్, సతీష్, ఆటో డ్రైవర్లు ఖాదర్ పాషా, సల్మాన్, లక్ష్మణ్, శ్రీను, మధు, సురేశ్ పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలు చెల్లించాలి

నేరడిగొండ: రైతులు, ప్రైవేట్ వ్యాపారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జమ ఖర్చుల వివరాలను సంఘ కార్యదర్శి బారే నాగభూషణం వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి కావాలంటే రుణాలు తీసుకున్న వారు సక్రమంగా చెల్లిస్తేనే సాధ్యమన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కళాలి వెంకట రమణ, డైరెక్టర్లు ఆడె వసంత్‌రావు, మోహన్, కృష్ణ, బన్సి, రాంచందర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899